


# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## నోటి ముందు కూడు

**ఇండియాలో** రిజర్వేషన్లు ఉన్నట్టే అమెరికాలో కూడా ఉన్నాయి కానీ అవి బయటకి కనిపించవు. అవి దేశీ ఇంట్లో మాత్రం తూ.చ తప్పకుండా జరిగిపోతూ ఉంటాయ్. ఇది నమ్మశక్యంగా లేకపోతే ఓ సారి వెనక్కి చూసుకోండి.

యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు మీరు ఒకరిద్దరి రూమ్మేట్స్ తో ఉండేవారా? ఎప్పుడైనా కారున్న ఓ సీనియర్ కుర్రాడు మిమ్మల్నందర్నీ షాపింగ్ కో, సినిమాకో తీసుకెళ్తే దారిలో ఏ టాకో జాయింట్ లోనో మెక్ డొనాల్డ్ లోనో ఆగి చిన్నపాటి ఫలహారమో, లంచ్, లేకపోతే ఇండియన్ రెస్టారెంట్ లో భోజనం అదీ కాకపోతే మరోచోట పిజ్జా అదే ఆల్ యూ కెన్ ఈట్ అనే చోట ఆగి తిన్నారా? అక్కడ ఎంత సంతోషం, మనకి నచ్చినవి ప్లేట్ లో పెట్టుకుని తిన్నంత తినేసి మిగతాది పారేసినా ఎవడూ అడగడు. దీనికి మీరు పెట్టుకున్న పేరు స్వేచ్ఛ. అయితే మీకు చదువైపోయి పట్టాభిషేకం అయ్యేక ఏమైంది? మొదట్లో పిజ్జా మీద మష్ రూమ్ టాపింగ్, కింద మామూలు బాటమింగ్ అమ్మగారికి ఏమాత్రం నచ్చకపోయినా మీరు తెప్పించారని ఆవిడ తిన్నారు ఒకట్రెండు సార్లు. ఆ తర్వాత ఆవిడ తెలుసుకున్న విషయాల ప్రకారం, మష్ రూం టాపింగ్ ని గ్రీన్ ఆలివ్స్, గ్రీన్ పెప్పర్స్ లాంటివి ఆక్రమించాయి – వాటికంటే బ్లాక్ ఆలివ్స్, పైనాపిల్ మీకు ఇష్టం అని తెలిసినా సరే. పోనీ పిజ్జా బాటమింగ్స్ మార్పు ఉండదనుకున్నారు మీరు కానీ అందులోనూ ఉరమరగా మార్పులొచ్చాయి. గార్లిక్ అయితే మంచిదిట వంటికి. అలా మీరు "కుటుంబం కోసం" కొన్ని వదులుకున్నారు – ఆ, కడుపు నిండడానికి ఏదో ఒకటిలే అనుకుంటూ, అవునా

కాదా? మామూలు టాకో స్థానం ఇప్పుడు టాకో సలాడ్ ఆక్రమించింది. అలా మీకు వేరేది తినాలని ఉన్నా, పస్తు ఉండాల్సి వస్తుందేమోనని నచ్చని పిజ్జా ఒక్క స్లయిస్ తో సరిపెట్టుకుని 'అబ్బే నాకు ఆకలి లేదు' అనడం నేర్చుకున్నారు. రాముడు మంచి బాలుడు; ఎవ్వరితోనో దెబ్బలాడడు. అందమైన అబద్ధములు ఆడును.

తొందర్లో మీకు ఒకరిద్దరు మహారాజులో, మహారాణీలో లేకపోతే వీళ్లలో ఓ కాంబినేషన్ పుట్టుకొచ్చారు. మహారాజు, మహారాణి అని ఎందుకనడం అంటే వాళ్లని ఎత్తుకుని పెంచేటప్పుడు, కాళ్ళు చాపితే సాక్స్, బూట్లు వేసి బయటకెళ్లడానికి కార్లో కూర్చోపెట్టేటప్పుడూ, ఏమాత్రం తేడా వచ్చినా మీరెంత అర్జెంట్ పని మీద వెళుతున్నా, వెంటనే కారు ఆపి వాళ్ల అవసరాలు చూసారుగా అందుకే. అలా రాజా రాణీలకి పదీ పదకొండేళ్ళు వచ్చేవరకూ భుజాలమీద వేసుకు తిప్పి ఇటు యూనివర్సల్ స్టూడియోనుంచి అటు డిస్నీలాండ్ దాకా తిప్పారు అవన్నీ చూసి వాళ్ళు ఆనందిస్తారని. అయితే ఓ సారి డిస్నీలోకి వెళ్ళాక అక్కడ మీరు రాజా/రాణీలని బండిలో పెట్టి చుట్టూ చూపించారా లేకపోతే వారికి డయాపర్ మార్చడానికీ, ఎండ తగలకుండా నీడలో ఉంచి వేయి కళ్ళు పెట్టుకుని చూస్తే వాళ్ళు హాయిగా బజ్జున్నారా? అక్కడ పోనీ ఏదైనా తిందామనుకుంటే మన ఇండియన్స్ తినేదేమీ కనపడదు కనక మెక్ డొనాల్డ్ లో వేయించిన దుంప ముక్కల్తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏదైమైనా మీరు మళ్ళీ "కుటుంబం" కోసం కష్టపడ్డారు. ఆ రోజు ఏం తిన్నా తినకపోయినా డిస్నీ జనం లోంచి ఏ మాత్రం దెబ్బలు తగిలించుకోకుండా, రాజూ, రాణీ తప్పిపోకుండా బయటపడినందుకు, ఆ తర్వాత అర్ధరాత్రో అపరాత్రో ఎక్కడా కారుకి ఏక్సిడెంట్ కాకుండా డ్రైవ్ చేసుకుని వెనక్కి వచ్చినందుకు మీకు సంతోషం. పోదురూ బడాయి, ఆమాత్రం ఎవరు చేయరు, ఇండియాలో మాత్రం మీ నాన్నగారు, మిమ్మల్ని సైకిల్ మీద కూర్చోబెట్టుకుని కూర్ల సంతకి తీసుకెళ్ళినప్పుడూ, ఎగ్జిబిషన్ చూపించడం లోనూ మీకు చేయలేదా ఏమిటి?

ఉత్తరోత్తరా ఇంట్లో ఎప్పుడైనా మీకో పెసరట్టో, మసాలా దోశ లాంటిదో తినాలంటే ఎవరికి తీరిక అది చేయడానికి? మహా అయితే మైసూర్ వుడ్ లాండ్స్ అనే చోటో, ఉడిపి లాంటి రెస్టారెంట్ లోనో తినడం బెటర్. ఇంట్లో అవన్నీ చేస్తూ కూర్చుంటే ఫేసు బుక్కు, వెబ్ సైట్లూ, ట్విట్టరూ చూడ్డం ఎలా, ఇంట్లో ఆ పెసరట్టు, ఉల్లిపాయ, ఆయిల్ వాసన అదీ పోవడం ఎలా? మీకు నచ్చినది మీరు చేయగలుగుతున్నారు, కనీసం హోటల్లో అయినా; అమెరికావాడు చెప్పలేదుటండీ కుటుంబ సౌఖ్యం, ధన ధాన్య వృద్ధిం అంటూ? గూట్లే ప్రశ్నలు వేయకండి. హిందూ మంత్రాలైనా సరే శంఖువులో పోస్తేకానీ తీర్థంకానట్టూ అమెరికావాడు చెప్తే కానీ అది మన తలకెక్కదు కదా?

ఈ లోపున మహారాణి, రాజు పెద్దవాళ్లవుతుంటే పిజ్జా ఆర్డర్ మీ చేతుల్లోంచి జారిపోయింది. ఇప్పుడు రాత్రి అన్నం తిందామనుకునే లోపులే రాణీగారు ఆల్రడీ ఒక చైనీస్ జాయింట్ నుంచి ఆర్డర్ చేసేసారు. అదే మీరు తినగలిగేదే లెండి – వెజిటేబిల్ రైస్ అని. అది మీకిష్టం అని ఓ సారెప్పుడో చెప్పారుగా? అందులో ఉప్పు ఎక్కువైపోయి ఇప్పటికి నలభై ఐదేళ్ళొచ్చిన మీకు బ్లడ్ ప్రెషర్ పెరిగిపోతుందని తెల్సినా తిన్నారు మరి రాణీగారు "మీ గురించి మాత్రమే" వేరేగా ఆర్డర్ చేసినందుకు సంతోషపడిపోయి. తర్వాత మరోరోజు రాజాగారికి పిజ్జా తినాలనిపించింది. మామా జానీ అనేచోట మన ఇష్టం వచ్చినట్టు ఆర్డర్ చేద్దాం, వాళ్ళు నా బ్లడ్ ప్రెషర్ అదీ దృష్టిలో పెట్టుకుని చేస్తారు అని మీరెంతగానో చెప్పడానికి ప్రయత్నం చేశారు. కానీ అమ్మగారు, రాణీ గారు, రాజు గారు మిమ్మల్ని – పనికిరాని బేవార్స్ గా చూస్తే – దానికి తల ఒగ్గి వాళ్ళకి ఇష్టం అయిన పిజ్జా హట్ లోంచే ఆర్డర్ ఇచ్చారు. ఆ ఆర్డర్ చేసినవి తినకపోతే డబ్బులు దండగ అనేదొకటీ, ఇంట్లో మరొకటేదీ వండరు ఇంక ఆ పూటకి పస్తుండాలనేది మరొకటీ గుర్తుంచుకుని ఆ "పెట్టిన" ముక్కలు తింటూంటే బ్లడ్ సుగర్ పెరిగింది, తర్వాత రోజు ఒంట్లో బాగోలేక ఆఫీసుకు శెలవు పెట్టారు కూడా.

మరికొన్ని ఏళ్ళొచ్చాక డాక్టర్ చెప్పినదాని ప్రకారం ఇంక ఎండు గడ్డే గతి. "ఏది పడితే అది" తినడం కుదరదు. నచ్చినది తినడం అసలు కుదరదు. ఒకానొకప్పుడు స్టూడెంట్ జీవితంలో "ఇష్టం వచ్చినది" తిన్నారంటే అప్పుడు మీకు పట్టాభిషేకం కాలేదు, మీరో స్వేచ్ఛా జీవి; అప్పుడు మీకు ఇరవై రెండేళ్ళు మాత్రమే. ఇప్పుడు "పెట్టినది" తినాలి అది ఎండు గడ్డి అయినా, టమోటా సాస్ కలిపిన పచ్చగడ్డి అయినా.

లేకపోతే పంచదార వేసుకోకుండా ఓ గ్లాసు పాలు, డాక్టర్ ఇచ్చిన మందూ, తినగలిగితే ఓ అర్టిపండూ. అలా నోరుకట్టేసుకోవాల్సిన రోజులు వస్తూనే ఉన్నయి ఇన్నాళ్ళ బట్టీను. అలా రావడం మీరు గమనించారా లేదా అనేది వేరే విషయం.

ఆగండాగండి రిజర్వేషన్ ల గురించి కదూ చెప్పుకోవడం మొదలుపెట్టాం? రెండోసారి పుట్టిన చిన్న వయస్సు మహారాణీ/రాజూ షెడ్యూల్ ట్రైబ్ వారు, వారిది మొదటి విడత. వారికివ్వాల్సినవి వారిచ్చేసాక మొదటి సారి పుట్టిన రాజూ/రాణీ షెడ్యూల్ కేస్ట్ వారు. వారిది రెండో విడత. అవిపోతే మిగిలిన దాంట్లో అమ్మగారిది బాక్ వార్డ్ కేస్ట్. ఆవిడది మూడో విడత. వీళ్ళ అవసరాలు తీ(ర్చా)రాక మిగిలినవి ఫార్వార్డ్ కేస్ట్ వారికి వస్తై. అదీ వాళ్ళు చేయి విదిలించాక. వాళ్ళ మూడ్ బట్టీ, అవసరాల బట్టీ ఆ విదిలించడం అనేది ఆధారపడుతుంది. ఐ ఐ టి లో సీటు దగ్గిర్నుంచీ మీరెప్పుడూ ఫార్వార్డ్ కేస్ట్ లోనే నెగ్గుతూ వస్తున్నారు. రాముడు మంచి బాలుడు; ఎవ్వరితోనో దెబ్బలాడడు. అందరినీ బాగా చూసుకొనును. మీరు అమెరికా వాడు చెప్పినట్టూ, కుటుంబం కోసం ఏదైనా చేయగలరు, చేసారు, చేస్తారు కూడా. మీది యమా టేస్టు. మీరు ఎంత తెలివైన వాళ్ళండీ!

**నీతిః రాముడు ఎంతమంచి బాలుడైనా పెళ్ళైయ్యాక నోరు మూసుకుని "పెట్టినది తినడం" నేర్చుకోకపోతే వస్తే.**

Post your comments